


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## పక్షుల కేంద్రం అభివృద్ధికి రూ.10 లక్షలు విరాళం




తడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
పులికాట్ సరస్సు తీరంలోని నేలపట్టు, ఇతర ప్రాంతాల అభివృద్ధి కోసం శ్రీసిటీ పరిశ్ర మలవారు రూ.10 లక్షలు విరాళం అంద జేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అటవీశాఖ అధికారులకు ఈ విరాళం అందజేశారు. పర్యావరణ పరిరక్షణ పట్ల తామెప్పుడూ అంకిత భావంతో ఉంటామని, ప్రకృతి పరిరక్షణకు శ్రీసిటీ కమ్యూనిటీ నుంచి రూ.కోటి విరాళం ఇవ్వాలన్న ప్రయత్నంలో భాగంగా ప్రస్తుతం ఈ రూ.10 లక్షలు ఇస్తున్నట్లు నిరీష సన్నారెడ్డి పేర్కొన్నారు. సూళ్లూరుపేట డిఎఫ్ఓ హారిక, ఇతర అటవీశాఖ అధికారుల సమక్షంలో శ్రీసిటీ ఫౌండేషన్ డైరెక్టర్ నిరీష సన్నారెడ్డి విరాళం చెక్కును తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సెల్వంకు అందజేశారు.

# సూర్యజయంతిన సూర్యప్రభపై శేషాచలదీశుడు



తిరుమల, ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:
సూర్యజయంతి(రథసప్తమి)పర్వదినాన కలియుగవైకుంఠం తిరుమలలో ఒకేరోజు మంగళ వారం ఉదయంనుండి రాత్రి వరకు ఏడువాహ నాలపై సప్తగిరీశుడు భక్తులకు దర్శన మిచ్చాడు. ఉదయం 5.30గంటల నుండి 8గంటల వరకు ఆలయ మాఢవీధుల్లో సూర్యప్రభవాహనంలో వచ్చిన శ్రీమన్నానారాయణుడిని దర్శించు కున్న భక్తులకు ఇతోధిక బోగభాగ్యాలు, సత్స ంతానసంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి. బంగారు సప్తఅశ్వాలు వాహనాన్ని లాగు తున్న సూర్యప్రభను అధిరోహించిన శ్రీమన్నారాయణుడు తిరు మాఢవీధుల్లో విహరించాడు. మలయప్ప స్వామి సూర్యప్రభామధ్యస్తుడై దివ్యకిరణకాంతుల్లో ప్రకా శిస్తూ భక్తులకు ఆరోగ్యవంతుల్నిచేస్తూ దర్శనమివ్వడంతో భక్తులు గోవిందనామాలతో ముక్తిని పొందారు. సాధారణంగా ఏడాది బ్రహ్మోత్స వాల్లో తొమ్మిదిరోజులు 16 వాహనసేవలు జరిగితే రథసప్తమిన ఒకేరోజు ఏడువాహనాలపై ఊరేగడం విశేషం. మంగళవారం ఉదయం తొలి వాహనంగా 5.30 గంటలకు శ్రీమన్నారాయణుడిగా సూర్యప్రభ వాహనంపై దర్శన మిచ్చిన కలియుగదేవుడు ఆ తరువాత వరుసగా ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేష వాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్స వం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవలపై ఊరేగారు. గరుడసేవలోనూ లక్షలాదిమంది భక్తులు మాఢవీధుల్లోఉండి మలయప్పస్వామి ని దర్శించుకుని ముక్తిపొందారు. తొలి వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు. టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం. ఆలయ పేష్కార్ రామకృష్ణ, బోర్డు సభ్యులు జ్యోతులనెహ్రూ, ఎంఎస్‌రాజు, భానుప్రకాష్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, నరేశ్, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఓ తదితరులు పాల్గొన్నారు.



### అమ్మవారి ఆలయంలో
# వైభవంగా రథసప్తమి





తిరుచానూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:
కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ సూర్యనారాయణుడి జన్మదినం సదర్భంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య నారాయణుడుని సుప్రభాతంతో మేలుకొలిపి ఏకాంత అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామి వారి ఉత్స వర్లకు స్నపన తిరుమంజనం చేపట్టారు. తరువాత స్వామి వారిని విశేషంగా అలంకరించి అశ్వవాహనంపై కొలువుదీర్చారు. తరువాత సూర్య భగవానుడు తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి ఆయన కృపాకటాక్షాలకు పాత్రులైనారు. అదే క్రమంలో పద్మావతి అమ్మవారు సప్తవాహ నాలపై కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఉదయం 7గంటల నుండి మద్యాహ్నం 4:30 వరకు వరుసగా అమ్మవారు సూర్యప్రభ వాహనంతో మొదలై హంస, అశ్వ, గరుడ, చిన్నశేష వాహనాలపై భక్తులను అనుగ్రహించారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుండి 9:30 నిమిషాల వరకు వరుసగా చంద్రప్రభ వాహనం, గజవాహనాలపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సప్తవానాలను వీక్షించి సూర్య భగవానుడు మరియు పద్మావతి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రలైనారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, ఏఈఓ దేవరాజులి, సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్, ఇన్స్పెక్టర్ చలపతి, ఏవియస్ఓ సతీష్ పాల్గొన్నారు.

## మహిళలు,యువత క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు చర్యలు
### - మంత్రి వై.సత్యకుమార్ యాదవ్



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :
రాష్ట్రంలోని మహిళలు, యువత క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, బీజేపీ నేతలు నవీన్ కుమార్‌రెడ్డి, పొనగంటి భాస్కర్ వర ప్రసాద్, పురుషోత్తం నాయుడు, నవీన్‌లతో పాటు పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్స వాన్ని పురస్కరించుకుని మహిళలు, యువత క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం

## కాసాగార్డెన్ వద్ద రోడ్డు ప్రమాదం
### -నలుగురు వ్యక్తులకు తీవ్రగాయాలు



తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
శ్రీకాళహస్తికి సమీపంలోని కాసాగార్డెన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్రగాయాలకు గురయ్యారు. టుటౌన్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కందుకూరు మండలం ఓడూరు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు తిరుపతిలోని నారాయణాద్రి సమీపంలో ఉన్న ఓ చిన్న ఇంట్లో ఉంటూ మేస్త్రీపనిజీవనంసాగిస్తున్నారు. జనవరి 31వ తేదీన తమ్ముని వివాహానికి వెళ్ళి తిరిగి వస్తున్న సమయంలో కాసాగార్డెన్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ వద్ద కారు అదుపు తప్పి వేలూరు నుంచి నెల్లూరుకు హైవేపై వెళ్తున్న ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. దీంతో నెల్లూరు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్పగాయాలకు గురవయ్యారు. తిరుపతికి వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న మురళీ(36), శ్యామల(30), హర్షిత(13), హర్షిణి(13)లు తీవ్రగాయాలకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న టుటౌన్ పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గురైన వారిని హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి తరలించి ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రూయాకు తరలించారు. కారును మరోకారు ఢీకొనడంతో వాటిని క్రేన్‌ల సాయంతో బయటకు తీశారు. టుటౌన్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

# తిరుపతిలో కూటమి ఆధిక్యం



### -నాటకీయ పరిణామాలతో డిప్యూటీ మేయర్‌గా టిడిపి కార్పొరేటర్ మునికృష్ణ



తిరుపతికార్పొరేషన్, ఫిబ్రవరి 4ప్రభాతవార్త:
అంతా ఊహించుకున్నట్లే ...వారంరోజుల ఉద్రిక్తతలకు, సందిగ్ధత లకు తెరపడింది. మంగళవారం ఉదయం జరిగిన నగరపాలక కౌన్సి ల్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో అనూహ్యనాటకీయ పరిణామాలతో 35వ డివిజన్‌కు చెందిన ఒకేఒక్క టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ రెండవ డిప్యూటీ మేయర్‌గా ఎన్నిక య్యాడు. ముందునుండి అందరి అంచనాలు తారుమారుచేస్తూ వైసిపి కార్పొరేటర్లు 25మంది కూటమిపార్టీకి మద్దతు తెలపడంతో డిప్యూటీ మేయర్ స్థానంలో టిడిపి పాగా వేసినట్లయింది. తిరుపతి మున్సి పల్ కార్పొరేషన్ కౌన్సి ల్‌లో 50మంది కార్పొరేటర్లుఉండగా మూడుస్థానాలు ఖాళీగా ఉన్నాయి. 47మందిలో 26మంది కూటమికి మద్దతుగా నిలిచారు. 21మంది వైసిపికి మద్దతుగానే చివరివరకు ఉండటంతో ఆర్‌సి మునికృష్ణ ఎన్నికవడం లాంఛనంగా మారింది. ఈ విషయాన్ని ఎన్నికల అధికారి ,జెసి శుభంబన్స ల్ ప్రకటించారు. కార్పొరేషన్ కౌన్సి ల్‌లో గత నాలుగేళ్లలో ఆర్‌సి మునికృష్ణ టిడిపి నుండి గెలిచి ఒక్కడే కౌన్సి ల్‌లో ఎదుర్కొన్న ఎన్నో పరాభవాలు, అనుభవాలు, చేదు సంఘటనలు ఇప్పుడు ఆయనకు కలిసొచ్చిన అవకాశంగా డిప్యూటీ మేయర్ అయ్యాడు. తిరుపతి నగరపాలక కౌన్సి ల్‌లో వైసిపి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి(వైసిపి), తిరుపతి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు (జనసేన), ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం(వైసిపి) ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్నారు. మంగళవారం ఉదయం తర్జనభర్జనలు అనంతరం మొదలైన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో 26మంది కార్పొరేటర్లు టిడిపి మునికృష్ణకు ఓటువేశారు. వైసిపి అభ్యర్థి లడ్డు భాస్కర్‌రెడ్డికి 21మంది మద్దతుగా నిలిచారు.

**-తొలినుండి కూటమివైపే:**

తిరుపతి నగరపాలక కౌన్సి ల్‌లో గత ఎనిమిదినెలలుగా వైసిపికి చెందిన కార్పొరేటర్లు 20మందివరకు కూటమివైపే మొగ్గుచూపుతున్నారు. గతంలోనే ఏకంగా వీరంతా కలసి టిడిపి పార్టీ కండువాలు వేసుకునేందుకు అమరావతివెళ్ళారు. అక్కడ టిడిపి అధినేత, సిఎం చంద్రబాబునాయుడు నుండి సంకేతాలు రాకపోవడంతో స్వతంత్రులుగానే కొనసాగుతున్నారు. వీరంతా ఇప్పుడు డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో తమ ఓటును కూటమి బలపరిచిన ఆర్‌సి మునికృష్ణకే వేసి మద్దతు తెలిపారు.

**-మేయర్‌కు అవిశ్వాసం తప్పదా!?:**

కాగా తిరుపతిలో అనూహ్యపరిణామాలతో కార్పొరేషన్‌లో డిప్యూటీమేయర్ పదవిని ఆర్‌సి మునికృష్ణ (టిడిపి)చేజిక్కించు కోవడం, మరో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ కూటమితోనే ఉండటంతో ఇక రానున్న రోజుల్లో మేయర్‌కు అవిశ్వాసం తప్పదని, ఆ కుర్చీపై అన్నా అనితను కూర్చోబెట్టే ప్రయత్నాలు ఇప్పుడు కూటమి పావులు కదపనుందనే సమాచారం.

**-ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి కిడ్నాప్ పుకార్లు...**

తిరుపతిలో బలమైన బిసి వర్గానికి చెందిన రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయిసుబ్రమణ్యంను డిప్యూటీ మేయర్ ఎన్నికకు కొన్ని గంటల ముందు కూటమి పార్టీలు కిడ్నాప్‌చేశారని ,ఫోన్‌లో కూడా అందుబాటులో లేరని వైసిపి వర్గీయులు ఆరోపించారు. అంతేగాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆయన ఏకంగా మంగళ వారం ఉదయం 11గంటలకు తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, అనారోగ్యకారణంగా తాను ఆస్పత్రిలో ఉన్నానని వివరణ ఇచ్చాడు.

**-మద్దతుకు కృతజ్ఞతలు: ఆర్‌సి**

తిరుపతిలో తొలినుండి టిడిపి పార్టీకి బలమైన కార్యకర్తగా నేతగా ఎదిగిన ఆర్‌సి మునికృష్ణ అందరివాడుగానే ఉన్నాడు. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా 35వ డివిజన్ నుండి గెలిచిన ఒకే ఒక్కడు. ఆయన తాజా డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసిపి కార్పొరేటర్ల మద్దతుతో ఆ పదవిని అందుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని మీవాడుగానే కాపాడుకుంటానని అన్నారు.



## ఒకే ఒక్కడు....అందివచ్చిన అవకాశం !
### -నాలుగేళ్ళ తరువాత డిప్యూటీ మేయర్ కుర్చీలో ఆర్‌సి

తిరుపతి, ఫిబ్రవరి 4ప్రభాతవార్త:
తిరుపతి మున్సి పల్ కార్పొరేషన్‌కు 2021లో జరిగిన తొలికౌన్సి ల్ ఎన్నికల్లో 50మందికి గాను 35వ డివిజన్ నుండి టిడిపి తరపున ఒకే ఒక కార్పొరేటర్‌గా ఆర్‌సి మునికృష్ణ గెలిచారు. గత నాలుగేళ్ళుగా ఆయన కౌన్సి ల్‌లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంటూనే అధికార వైసిపి కౌన్సి ల్‌లో పలు అంశాలపై, అభివృద్ధి అజెండా పనులపై గొంతెత్తి చాటారు. ఈ విషయాల్లో అనేక సార్లు కొందరు కార్పొరేటర్లతోబాటు ఎక్స్ అఫిషియోసభ్యుడిగా వ్యవహరించిన గత ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి, చివరకు నగరపాలక అధికారుల నుండి ఎన్నో పరాభవాలు, వింత సంఘటనలు చవిచూశారు. అయినా ఆయన ఎక్కడా ఎవరికీ తలొగ్గక అధికారులతో కలసి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ దశలో గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి డిప్యూటీ మేయర్‌గా ఉన్న అభినయ్ పదవులకు రాజీనామా చేయడంతో ఈ పదవి ఖాళీ అయ్యింది. ఎనిమిది నెలల తరువాత తాజాగా జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఏ మాత్రం బలం లేకపోయినా ఆర్‌సి మునికృష్ణ తనదైన రీతిలో వైసిపి కార్పొరేటర్లతో కలసి అందరినీ పలకరించడం, అధికార కూటమిలో టిడిపి, జనసేన ,బిజెపి నాయకుల సహకారంతో మంగళవారం ఏకంగా డిప్యూటీ మేయర్ పదవిని అందుకోవడం ప్రత్యేక సంచలనమే. ఇలా కార్పొరేషన్‌లో ఒకే ఒక్కడు టిడిపి కార్పొరేటర్ కొత్తపదవిలో కూర్చోవడం మాటలతోకాదు....చేసిన కష్టం ఫలితందక్కింది. 1999లో తెలుగుదేశంపార్టీలో అప్పటి పుత్తూరు ఎంఎల్‌ఎగా పోటీచేసి గెలిచిన రెడ్డివారిరాజశేఖర్‌రెడ్డి పార్టీలోకి తీసుకువచ్చారు. అప్పటినుండి ఆర్‌సి తన రాజకీయ జీవితాన్ని సాగిస్తూ వస్తున్నారు. 2004లో టిడిపి ప్రభుత్వం అదికారం కోల్పోయిన సమయంలో ఈయన తిరుపతి నగరపార్టీ అధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఇప్పుడు ఆయనకు రాజకీయంగా ,మంచి వ్యక్తిగా అందరితో కలుపుకుని వెళ్ళే నాయకుడుగా ముద్రపడటంతో ఒక్కడైనా డిప్యూటీ మేయర్ కుర్చీని చేజిక్కించుకోవడం విశేషం.

# ఆట మొదలైంది..!!

**- కుప్పం మున్సిపల్ ఛైర్మన్ పదవికై మంతనాలు !!**
**- ముఖ్యనేతల సమక్షంలో చర్చలు.. నలుగురు వైకాపా కౌన్సిలర్లకు గాలం..?**




కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో అత్యంత కీలకమైన కుప్పం మున్సి పల్ ఛైర్మన్ పదవికై అధికార తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలు మళ్లీ పావులు కదుపుతూ రంగంలో దిగారు. మంగళవారం రాత్రి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ నేతృత్వంలో ఏపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం తదితరులు పాలారు వద్ద ఉన్న ఫామ్‌హౌస్‌లో పెద్ద ఎత్తున మంతనాలు జరిపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తెదేపా తరపున ఎన్నికైన కౌన్సి లర్లు ఆరుమంది, వైకాపా నుంచి చేరిన నలుగురు మంది కౌన్సి లర్లతో పాటు ఇతర ముఖ్య నేతలు, ఛైర్మన్ పదవి ఆశిస్తున్న నేతలు కలసి సమావేశమైనట్లు సమాచారం. కుప్పం మున్సి పల్ పరిధిలో 25 వార్డులు ఉండగా 2021లో జరిగిన ఎన్నికల్లో వైకాపా 19 కౌన్సి లర్ స్థానాలు గెలుచుకుంది. తెదేపా 6 కౌన్సి లర్ స్థానాలు గెలిచింది. గతేడాది తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నేపథ్యంలో మున్సి పాలిటీలో కూడా మార్పులు చేసుకున్నాయి. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మున్సి పల్ ఛైర్మన్ స్థానాన్ని తెదేపాకు దక్కేలా వ్యూహం రచించారు. అందులో భాగంగా వైకాపా నుంచి 5మంది కౌన్సి లర్లు తెదేపాలో చేరారు. అయితే వీరిలో ఓ కౌన్సి లర్ మరలా వైకాపా గూటికే చేరారు. కాగా మున్సి పల్ ఛైర్మన్‌గా ఉన్న డా॥ సుధీర్ సైతం కౌన్సి లర్ , ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి తెదేపా సరసన చేరారు. దీంతో 16వ వార్డుకు ఎన్నిక జరగాల్సి ఉంది. ఈ సంగతి ఇలా ఉంచితే ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి 10మంది కౌన్సి లర్లు ఉన్నారు. మరో 4మంది కౌన్సి లర్లు చేతికి చిక్కితే 16వవార్డు ఎన్నికతో సంబంధం లేకుండానే మున్సి పల్ ఛైర్మన్ పదవి తెదేపా దక్కించుకుంటుంది. దీంతో నలుగురు కౌన్సి లర్లకు గాలం వేసేందుకు చర్యలు మంగళవారం నుంచి మరలా మొదలైనట్లే లెక్క. కొందరు వైకాపా కౌన్సి లర్లు ఇప్పటికే 'టచ్'లో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మంగళవారం నాటి సమావేశంలో ఛైర్మన్ పదవిపై సైతం చర్చలు జరిగాయని తెలిసింది. ఈవిషయంగా తీవ్ర పోటీ నెలకొందని సమాచారం. అయితే ఛైర్మన్ పదవి అంశం ఎవరికి వరిస్తుందోననే ఉత్కంఠ ఇప్పుడు తెదేపా శ్రేణుల్లో నెలకొంది.

## వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



తిరుచానూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త:
జాతీయ రహదారిలో టమోటాలు తరలిస్తూ వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొని ఒక వ్యక్తి మరణించగా మరో వ్యక్తికి తీవ్రగాయాలు అయిన సంఘటన తిరుచానూరు స్టేషన్ పరిలోని దామినేడు సమీపంలో చోటు చేసుకుంది. తిరుచానూరు యస్.ఐ అరుణ సమాచారం మేరకు మహేష్ (27) వెంకటిగిరి మండలంలోని ఉట్లవారిపల్లెల్లో తన తల్లితండ్రులతో కలసి జీవిస్తున్నారు. తాను డ్రైవరుగా టాటా ఏసి వాహనం ద్వారా టమోటాలు తరలించి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో పలమనేరు నుండి చెన్నైకు టమో టాలు తరలిస్తుండగా యన్.హెచ్ 150 చిత్తూరు నాయడుపేట జాతీయ రహదారిలో మంగళవారం వేకువజామున వాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొని బోల్తా కొట్టింది. ఈ దుర్ఘటనలో డ్రైవర్ మహేష్ అక్కడికక్కడే మృతిచెందారు. క్లీనర్ తీవ్రగాయలతో చికిత్స పొందుతున్నాడు. స్థానిక పోలీసులు వాహనం స్వాదీనం చేసుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని శరీరాన్ని పోస్టుమార్టన్ నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు, క్లీనర్‌ను అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించారు.

# ప్రాణాంతకమైన వ్యాధులపై విస్తృతంగా అవగాహన

**- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్**

**యాదమరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**
ప్రాణాంతకమైన జ్వరాల పట్ల క్షేత్ర స్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. యాదమరి పిహెచ్‌సిలో మంగళవారం పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్, సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో జరిగిన ఆశా నెలవారీ సమావేశానికి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందడంతోనే డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా జ్వరాలు ప్రబలతాయని, క్షేత్ర స్థాయిలో మాతా శిశు మరణాలకు అడ్డుకట్ట వేయడం ఎంత



ముఖ్యమో దోమ కాటు వల్ల వచ్చే ప్రాణాంతకమైన జ్వరాలకు అడ్డుకట్ట వేయడం అంతే ముఖ్యం అన్నారు. పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ క్యాన్సల్ లక్షణాలు కల్గిన ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించాలన్నారు. క్యాన్సర్ వ్యాధిపై క్షేత్ర స్థాయిలో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మలేరియా అధికారి రామకృష్ణారెడ్డి, సబ్‌యూనిట్ ఆఫీసర్ శివసుబ్రమణ్యం, సూపర్‌వైజర్లు సెల్వరాణి, లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానంలో ఈఓ విస్తృత తనిఖీలు

**కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈఓ పెంచల కిషోర్ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు దేవాలయాల దుకాణ సముదాయాలు, పాలాభిషేకానికి పాలు వి క్రయించే స్థలం, లగేజి భద్రపరచు కౌంటర్, పాదరక్షలు, సెల్‌ఫోన్ భద్రపరచు కౌంటర్, కొబ్బరికాయలు కొట్టే స్థలం వద్ద ఈఓ తనిఖీలు నిర్వహించారు. ఈసందర్బంగా క ఔంటర్ల వద్ద రశీదులను పరిశీలించారు. దేవస్థానం కౌంటర్లు వద్ద దేవస్థానం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కొబ్బరికాయలు కొట్టే స్థలంలో పనిచేసే సిబ్బంది భక్తుల నుండి ఎలాంటి రుసుమును వసూలు చేయరాదని తెలిపారు. అనంతరం ఆలయ పరిసరాల్లో భక్తుల నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే భక్తులు సీఎం డాష్ బోర్డు క్యూఆర్‌కోడ్‌లను స్కానింగ్ చేసి తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ప్రసాద్, సూపరెండెంట్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో రోడ్ల అభివృద్ధికి 53కోట్లు మంజూరు

**కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**
కుప్పం నియోజకవర్గంలో వివిధ రోడ్ల అభివృద్ధికి గాను రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఐడిఎఫ్ గ్రాంట్ ద్వారా 53.35 కోట్ల రూపాయల నిధులను రోడ్లు మరియు భవనాల శాఖకు మంజూరు చేసింది. ఈనిధులతో కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, గుడుపల్లె మండలాల్లో 23 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు.

## చోరీ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు

**కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**
కుప్పం పట్టణం సిరికల్చర్ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో సోమవారం చోరీ జరిగిన సంఘటనపై బాధితులు మంగళవారం కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 200 గ్రాముల బంగారంతో పాటు వెండి, కొంత నగదు సైతం గుర్తు తెలియని దుండగులు పట్టుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అర్బన్ సిఐ శ ంకరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

**వెంకటగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



ఈనెల ఏడో తేదీ లోపల సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో కె.వి కోటేశ్వరరావు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బీసీ, కాపు, కమ్మ, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా ఔత్సాహకులకు స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి 21 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలు లోపు వయస్సు గలవారు సంబంధిత సచివాలయాల్లో ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. క్యాస్ట్, బర్త్, రేషన్, ఆధార్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, బ్యాంకు పాస్ పుస్తకాలు, మొబైల్ నెంబరు వంటి ధ్రువపత్రాలతో ఈనెల 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మార్చి 1 నుంచి డాక్యుమెంటేషన్ ప్రక్రియ జరిగి 10 నుంచి 20వ తేదీ లోపు సబ్సిడీ యూనిట్స్‌ను రుణా మేళ నిర్వహించి ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధుల సమక్షంలో మంజూరైన యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

## ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు

**కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఫైనలియర్ చదువుతున్న ట్రిపుల్-ఈ విద్యార్థులకు రిలయన్స్ కంపెనీ వారు మంగళవారం వర్చువల్‌గా ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. టెక్నికల్ రౌండ్‌లో ఎంపికైన విద్యార్థులకు చివరిగా ముఖాముఖి హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.7.5 లక్షలు ఉన్నట్లు కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ ఎన్.కిషందర్ తెలిపారు. ఆ మేరకు ఎంపికైన విద్యార్థి ఎస్‌కె ఇంతియాజ్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అభినందించారు.

## వివాహ రిసెప్షన్‌కు హాజరైన మంత్రి నిమ్మల రామానాయుడు

**కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా॥ నిమ్మల రామానాయుడు మంగళవారం కుప్పం విచ్చే శారు. కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర కుమార్తె వివాహ రిసెప్షన్ స్థానిక బిసిఎన్ రిసార్ట్‌లో జరగ్గా ఆ కార్యక్రమానికి మంత్రి నిమ్మల హాజర య్యారు. విజయవాడనుంచి తమిళనాడులోని జోలార్‌పేట జంక్షన్‌కు మంత్రి రైలులో చేరుకుని అక్కడనుంచి కారులో కుప్పం వచ్చారు. అనంతరం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో మంత్రికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత గోపీనాథ్ తదితరులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. రిసెప్షన్‌లో పాల్గొన్న అనంతరం మంత్రి తిరుగుప్రయాణమయ్యారు.

## శ్రీవరదరాజస్వామిని దర్శించుకున్న జడ్పీచైర్మన్

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



మున్సిపల్ పరిధి లక్ష్మీపురం ఆలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఈసందర్భంగా విశేషంగా అలంకరించారు. ఈసందర్భంగా స్వామివారిని జడ్పీచైర్మన్ శ్రీనివాసులు దంపతులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## హలో మాదిగ .... చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

**పుంగనూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



మాదిగల ఐక్యత కోసం ఈ నెల 7న హైదరాబాద్లో జరిగే హలో మాదిగ చలో హైదరాబాద్ కార్యక్రమానికి నియోజకవర్గ మొత్తం మాల మాదిగలు తరలిరావాలని, నియోజకవర్గం ఇన్చార్జి బి నరసింహులు మంగళవారం పిలుపునిచ్చారు. హైదరాబాద్ కేంద్రంగా జరుగు లక్షల డప్పులు వేల గొంతుల సభ విజయవంతం చేయడానికి సన్నాహక కార్యక్రమం నిర్వహిస్తు.. కరపత్రాలను ఆవిష్కరించారు.. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ విశిష్ట అతిథులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరు మురళి మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ చట్టభద్ధతకై 30 ఏళ్ల అ పోరాటం చేసారన్నారు. మండలం ఇంచార్జ్ మాతంగి నాగభూషణం కో ఇంచార్జ్ వరగాని ప్రభాకర్ చౌడేపల్లి మండలం ఇన్చార్జి పగడాల గోవిందు బాజీకి మరీ బాబు మల్లురి హరిబాబు సోమల ఎమ్మార్పీఎస్ మాజీ సహాయ కార్యదర్శి మందా రామనాథం సీనియర్ నాయకులు మొగిలిశ్వర నేతిగుట్లపల్లె అమర్నాథ్ మరసనపల్లి నరసింహులు (శంభు) మాదిగ, సూరి లక్షన్న శ్రీరాములు గంగులప్పమాదిగ తదితరులు పాల్గొన్నారు.. నాయుకు మాదిగ, నాగేంద్ర మ మాదిగ, రామాంజులు మాదిగ, శ్రీనివాసులు నారాయణస్వామి ఓబులేసు మాదిగ పాల్గొన్నారు.

## మందకృష్ణకు పద్మశ్రీ సముచితం

**విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు**

**పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



నిండు సభలో మందకృష్ణ మాదిగను కౌగిలించుకుని, పడిన కష్టాన్ని కొనియాడి, ఒక సంఘ నాయకుడికి ఒక ప్రధానమంత్రి కౌగిలించుకోవడం భారత జాతీయ ఔన్నత్యానికి నిదర్శనమని విశ్రాంతి డిఎస్పి తెలుగుదేశం నాయకుడు వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కల్మకుంట సుకుమార్ బాబు అన్నారు. హైదరాబాద్‌లో జరగబోయే లక్ష డప్పులు వేయి గొంతులు కార్యక్రమానికి హాజరవుతున్న పుంగనూరు మన మాదిగ సంఘానికి బుధవారం ఆయన మద్దతుగా మాట్లాడుతూ రేణుక పగలను రాష్ట్రమంతా పర్యటించిన మందకృష్ణ మాదిగను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చి సత్కరిచ్చిందని అన్నారు. సంఘనాయకుడు నరసింహులు మురళి, సభ్యులు హైదరాబాద్ వెళ్లడానికి దారి ఖర్చులతో పాటు ఆయన 12 డప్పులు విరాళంగా తీసిచ్చారు. ఈ కార్యక్రమంలో దేశాది శ్రీనివాసులు మాదిగ సంఘం నాయకులు నరసింహులు, మురళి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేడు యాదమరి ఐసిఎల్‌లో ఎన్‌డిఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్

**- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్**



**చిత్తూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**
యాదమరి మండలంలోని ఐసిఎల్ ఆవరణలో బుధవారం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డిఆర్‌ఎఫ్,నేషనల్ డిజాస్టర్ రిస్పాన్స్ ఫోర్స్) ఆధ్వర్యంలో నిర్వహించే మాక్ డ్రిల్‌లో అధికారులు అందరు పాల్గొనాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ కార్యాలయంలోని డిఆర్‌ఓ ఛాంబర్‌లోని సమావేశభవనంలో మంగళవారం డిఆర్‌ఓ మోహన్‌కుమార్ యాదమరి ఐసిఎల్‌లో బుధవారం ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే మాక్ డ్రిల్‌పై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారుడిఆర్‌ఓ మాట్లాడుతూ విపత్తు సమయంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ పాత్ర కీలకమన్నారు. అనుకోకుండా వచ్చే విపత్తుల నుండి ఎలా బయటపడాలి అనే విషయాలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్స్‌పెక్టర్ అనితా సదన్, జిల్లా వ్యవసాయశాఖ అదికారి మురళీకృష్ణ, జిల్లా పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడుపుతూ

**పట్టుబడిన వారికి రూ.1.80 లక్షలు జరిమానా**

**చిత్తూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**
చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 18 మందికి మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి 1.80 లక్షల రూపాయల జరిమానా విధించారు. చిత్తూరు నగర ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ట్రాఫిక్ పోలీసులకు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 18 మంది వాహనదారులు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు వీరిని మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి ఎదుట హాజరుపరిచారు. ఈ కేసు పూర్వపరాలను పరిశీలించిన జడ్జి ఉమాదేవి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన ఒకొక్క వాహనదారుడికి 10 వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. ఈ మేరకు 18 మంది వాహనదారుల నుండి. 1.80 లక్షల రూపాయల జరిమానాను కోర్టు విధించి వసూలు చేసింది.

## కాణిపాకంలో ఘనంగా గ్రామోత్సవం

**కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో మంగళవారం జరిగిన రథసప్తమి వేడుకల సందర్భంగా ప్రధాన ఆలయంతో పాటు శ్రీశ్రీదేవి భూదేవి పెరిందేవి సయిత వరదరాజస్వామి ఆలయంలలో స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవంలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ప్రధాన ఆలయంలో నిర్వహించిన రథసప్తమి వేడుకలకు కాకర్లవారిపల్లెకు చెందిన కీరి_శేషులు నాధమునినాయుడు కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉదయం ఉభయదారులు ప్రధాన ఆలయంకు వరుస ఉభయం తీసుకురాగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం ప్రధాన ఆలయంలోని స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను మూషిక వాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి, ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామాలకు ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## దళిత సత్రానికి ప్రత్యామ్నాయం,పరిహారం అందించాలి

**-దళితసత్రం సేవాసమితి అధ్యక్షులు జి.కేశవులు**

**కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**
ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకం శ్రీస్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అభివృద్ధి కోసం స్వాధీనం చేసుకున్న దళిత సత్రానికి ప్రత్యామ్నాయం,పరిహారం అందించాలని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం దళిత ఉభయకర్తలు మరియు దళిత సేవాసమితి అధ్యక్షుడు జి.కేశవులు డిమాండు చేశారు. మంగళవారం ఆయన కాణిపాకంలో విలేకరులతో మాట్లాడుతూ కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చే దళిత భక్తుల కోసం ఆలయ సమీపంలో ఐదు సెంట్లు స్థలంలో 1958లో దళిత పెద్దలు, దళిత సాధువులు సత్రాన్ని నిర్మించారని తెలిపారు. అయితే ఈసత్రాన్ని ఆలయ అభివృద్ది పేరిట 2000 సంవత్సరంలో దేవస్థానం స్వాధీనం చేసుకుందని తెలిపారు. అయితే ఇప్పటి వరకు అందుకు తగిన నష్టపరిహారం కాని, ప్రత్యామ్నాం కాని అందించలేదని తెలిపారు. కావున దేవస్థానం అధికారులు, ప్రభుత్వం స్పందించి దళిత సత్రానికి ప్రత్యామ్నాయంగా 15 సెంట్లు భూమిని, దళిత ఉభయదారుల కోసం కోటి రూపాయలతో చంద్రప్రభవాహనాని ౖ పునర్నించి ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు.

## విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

**- కెఇసి వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్**



**కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**
విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ సూచించారు. మంగళవారం కళాశాలలో టెక్నికల్ ఫస్ట్ -2025కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల లక్ష్యసాధనకు ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఒక వేదిక అన్నారు. ఇంజనీరింగ్ టెకా ౖలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈసందర్బంగా మొత్తం 25 బృందాలు వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, ప్రొఫెసర్లు రసదొరై, డా॥ శేఖర్, అజయ్‌కుమార్‌రెడ్డి, డా॥ జ్ఞానమూర్తి, డా॥ నవీన్‌కుమార్, డా॥ సంతోష్, డా॥ సతీష్,పిఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన దుండగులు

**కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**
కుప్పం పట్టణం కమతమూరు రోడ్డులో తెల్లవారి ఇంటి వద్ద ముగ్గులు వేస్తున్న మహిళ మెడలోంచి చైన్ లాక్కెళ్లిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. నారాయణమ్మ అనే మహిళ తన ఇంటి ముందర ముగ్గులు వేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారుచైను లాక్కెళ్లి పరారైనట్లు చెప్పారు.

# అరగొండలో ఘనంగా రథసప్తమి వేడుకలు

**తవణంపల్లె, పిబ్రవరి 4 ప్రభాతవార్త:**
మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామివారి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో రథసప్తమి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఉదయం అరగొండ గ్రామంలో వివిధ ఆలయాలలో వెలసిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి సూర్యప్రభవాహనంపై వుంచి అరగొండ, గాజులపల్లె, తొడతర, చెర్లోపల్లె, కామాలూరు, బిసీ.కాలనీల మీదుగా అర్ధగిరి చుట్టూ గిరిప్రదక్షణ(కొండచుట్టు తిరునాళ్ళు) నిర్వహించారు. ఈకార్యక్రమంలో అర్చకులు ప్రసాద్



స్వామి, ఆయా గ్రామాల ప్రజలు, అర్చకులు పాల్గొన్నారు.

***అర్ధగిరిలో...***

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామివారి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా ఉదయం ప్రత్యక్ష భగవానుడు సూర్య నారాయణస్వామి ఉదయించే వేళ ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవాయిద్యాల నడుమ సూర్య భగవానుడికి హారతులిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## వాహనాలు నడిపే డ్రైవర్లు నియమాలు పాటించాలి..ఆర్టీఓ

**శ్రీకాళహస్తిరూరల్, జనవరి 4 ప్రభాతవార్త**




రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం కాపుగున్నేరి సమీపంలో ఉన్న కోకో కోలా ప్యాక్టరీలో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీకాళహస్తి మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదర్‌నాయుడు మాట్లాడుతూ కోకో కోలాకు సంబందించిన వాహనాలు నడిపే డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలు పాటించాలని, ప్రస్తుతం కోక కోలా వద్ద ఆరు వరుసల రహదారి వచ్చినందును వాహనాలు వేగంగా వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి పరిస్థితుల్లోను రోడ్డును ఓవైపు నుంచి ఇంకోవైపు దాటడానికి ప్రయత్నించరాదన్నారు. అలాగే వాహనాలు కంపెనీ ముందు హైవే మీదుగా పార్కింగ్ చేయరాదని అలా చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిపై చర్యలుతీసుకుంటామని తెలిపారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో కోకో కోలా కంపెని ప్రతినిధులు పాల్గొన్నారు.

## శివనాధపురంలో అక్రమణలపై ఉక్కుపాదం

**తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



మండలంలోని శివనాధపాళెం రెవెన్యూ పరిధిలోని శివనాధపురం గ్రామంలో అక్రమణలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. తహశీల్దార్ మధుసూదనరావు, డిప్యూటీ తహశీల్దార్ జగన్‌మోహన్‌ల ఆదేశాలతో శివనాధపాళెం రెవెన్యూలోని శివనాధ పురంలో ఉన్న ఆక్రమణల్లో ఉన్న భూములను గుర్తించి అక్కడ బోర్డులను నాటారు. శివనాధపురం గ్రామంలోని సర్వేనంబర్ 1/2ఎలో 1.25 ఎకరాలు, 1/2బిలో ఒక ఎకరా భూములను కొందరు రియల్ వ్యాపారులు ఆక్రమించుకుని ఉన్నారని దీంతో ఇక్కడి డికెటి భూముల్లో బోర్డులు నాటామన్నారు. కొందరు రియల్ వ్యాపారులు ఈసందర్బంగా విఆర్‌ఓ గోపి, సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామిలు మండలంలో ప్రభుత్వ, డికెటి భూములను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎవరైనా ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలుతీసుకోవడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

**తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



తొట్టంబేడు ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లహరిని ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్‌పై అవగాహన దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. ఈసందర్బంగా వైద్యాదికారులు డాక్టర్ లహరిని, సాయిపూజ మాట్లాడుతూ మహిళలు, బాలికలు, క్యాన్సర్ ఆరోగ్య సంరక్షణ కోసం ముందస్తుగా పరీక్షలు సత్వర చికిత్స చేసుకోవాలని ముందస్తు క్యాన్సర్ పరీక్షల నుంచి అందరినీ సంరక్షించవచ్చని తెలిపారు. **ఏరియా ఆస్పత్రిలో..** క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలోని వైద్యులు సిబ్బందితో కలసి రోగులకు అవగాహన కల్పించడంతోపాటు ర్యాలీ నిర్వహించారు. ఊబకాయం, సరైన వ్యాయామం లేకపోవడం, మద్యం సేవించడం, దూమపానం వంటి అలవాట్ల వల్ల క్యాన్సర్ వ్యాధి వస్తుందని సరైన అలవాట్లును అలవర్చుకుంటే క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చన్నారు. క్యాన్సర్ వ్యాధిపై స్క్రీనింగ్ పరీక్షల గురించి తర్వాత స్వీయ పరీక్ష నిర్వహించుకోవడంపై తెలిపారు. కార్యక్రమంలోసూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మితో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 6న పురుషుల డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

**.తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**
శ్రీస్వామి విద్యాప్రకాశనంద పురుషుల డిగ్రీ కళాశాలలోని జెకెసి విభాగం ఆధ్వర్యంలో ఈనెల 6వ తపదీన ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజునాయుడు తెలిపారు. ఉద్యోగ మేళాకు 18 సంవత్సరాల వయస్సు నుంచి 27 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు అర్హులన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులు పాస్ లేదా ఫెయిలైన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.14,450 నుంచి రూ.16,270వేల వరకు వేతనాలు పొందవచ్చున్నారు. దీనితో పాటు ఇతర అలవెన్సులు ఇవ్వబడుతాయన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, పాస్‌పోస్టు సైజు ఫోటోలు తీసుకురావాలన్నారు. వివరాలకు 9440502338, 7981473121 నంబర్లను సంప్రదించాలన్నారు.

## పార్కుల్లో నిర్వహణ లోపిస్తే చర్యలు తప్పవు

***తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త*** తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కుల్లో నిర్వహణ లోపం కనిపిస్తే సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య హెచ్చరించారు. మంగళవారం తిరుపతి నగరంలో తుడా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బైరాగిపట్టెడలోని బాబు జగజ్జీవన్ రామ పార్కు, శ్రీనివాస్ పార్కు, కపిలతీర్థం ఎన్.జి.వో కాలనీలోని పార్కును అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపా ధ్యక్షులు మాట్లాడుతూ తుడా ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాలలో నిర్వహిస్తున్న పార్కులు సుబ్రంగా ఉంచాలని అన్నారు. మరమ్మత్తులకు గురైన ఆట వస్తువులు బాగు చేయాలని అన్నారు. మొక్కలు ఎండి పోకుండా నీరు పెట్టాలని అన్నారు. ఎండిపోయిన మొక్కలు తొలగించి కొత్త మొక్కలు నాటాలని, అలాగే పచ్చిక ఏర్పాటు చేయాలని అన్నారు. వాకర్స్ ప్రతి రోజు పార్కులో నడిచేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. పార్కుల నిర్వహణలో లోపం కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధ్యక్షులు వెంట ఈ.ఈ. రవీంద్ర, ఉద్యానవన శాఖాధికారి మాలతి,ఉన్నారు.

## మార్చి 31 లోపు పెండింగ్ ఉన్న బిపిఎస్, ఎల్ఆర్ఎస్‌కి దరఖాస్తు చేసుకోండి

**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**
2019వ సంవత్సరములో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు జారీచేసిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం 2019 నందు అనుమతి లేని, విరుద్ధముగా నిర్మించిన భవనములను క్రమబద్ధీకరణకు మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 వ సంవత్సరంలో అర్జి సమర్పించి ఇప్పటికీ క్రమబద్ధీకరణ కాకుండా పెండింగ్ లో ఉన్న అర్జిదారులకు మార్చి 31 వ తేదీవరకు మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే 2020వ సంవత్సరంలో ప్రభుత్వం జారీచేసిన లేఔట్ రేగులరైజేషన్ స్కీం 2020 నందు అనుమతిలేని లేఔట్లు, ప్లాట్లు కమబద్ధీకరించుకోవడానికి మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. భవనాలు క్రమబద్ధీకరించుకోవడం వలన ప్రత్యేకంగా ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ పొందవలసిన అవసరము లేదని, భవిష్యత్తులో భవన నిర్మాణ ఫీజు లో మినహాయింపు ఉంటుందని, ఆస్తి పన్ను పై ఎటువంటి పెనాల్టీ ఉండదని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ను 2007 తరువాత తిరిగి అమలులోకి తేవడం.జరిగిందని అన్నారు. లేఔట్ల, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవడం వలన 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు మినహాయింపు ఉంటుందని, పీనల్ చార్జీల నుండి మినహాయింపు ఉంటుందని, రోడ్డు మరియు యాజమాన్య హక్కులు ద్రువీకరించబడతాయని తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలిపారు.

## బోటు ఇంజన్ కోసం కలెక్టర్‌కు వినతి



తడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : తడ మండలం ఇరకం దీవికి స్కూలు పిల్లలు వెళ్లే బోటు ఇంజన్ మంజూరు చేయాలని ఆ దీవికి చెందిన పలువురు జిల్లా కలెక్టర్‌ను కోరారు. మంగళ వారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఇరకందీవి ప్రజలు కలెక్టర్‌ను కలిశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సమక్షంలో ఇటీవల జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ఇరకం దీవి స్కూలు పిల్లలకు బోటు సక్రమంగా ఉండేలా ఇంజన్ మంజూరు చేస్తామని కలెక్టర్ కూడా హామీ ఇచ్చి ఉన్న కారణంగా ఇరకం దీవి ప్రజలు ఆయనను కలిశారు. జయపాల్, మణికంఠన్, పరమన్ తదితరులు ఉన్నారు.

# గూడూరు డివిజన్

## రోడ్డు ప్రమాదంలో గాయాలు

తడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : తడ మండలం పులివేంద్ర వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నై కార్పొరేషన్ ఉద్యోగి శీనయ్య గాయపడ్డాడు. నెల్లూరు జిల్లా పొట్టిపల్లిపాడుకు చెందిన శీనయ్య స్కూటీలో చెన్నై వైపు వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీ కొనడంతో అతను తీవ్ర గాయాలకు గురై స్పృహ తప్పి పడిపోయాడు. గ్రామస్థులు 108కి సమాచారం అందించడంతో వారు మొదట సూళ్లూరుపేటకు, అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తరలించినట్లు తెలిసింది.

## సూళ్లూరుపేటలో రథసప్తమి వేడుకలు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో రథసప్తమి పర్వదిన వేడుకలను మంగళ వారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాండురంగస్వామి దేవస్థానంలో పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసిన అనంతరం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం, అలఘు మల్లారిస్వామి దేవస్థానం, శ్రీమద్వేంకట రామమూర్తి దేవస్థానం, ఇతర దేవాలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాండురంగస్వామి గ్రామోత్సవంలో మాజీ సర్పంచ్ మాదరపాక బాలసుబ్రహ్మణ్యం దగ్గరుండి నిర్వహించారు.

## క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



గూడూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి నివారణ, గుర్తింపు, చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నారాయణ ఇంజనీరింగ్ కళాశాల గూడూరులో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిసోర్స్ పర్సన్ డాక్టర్, షేక్ షరీనా సూపరింటెండెంట్ గూడూరు ఏరియా ఆసుపత్రి. డాక్టర్, షేక్ షరీనా మాట్లాడుతూ యునైటెడ్ బై యునిక్ 2025 ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం యొక్క థీమ్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ సంరక్షణ, ఆరోగ్య వ్యవస్థలలో ప్రజాకేంద్రీకృత విధానం వైపు ప్రాథమిక మార్పు కోసం ఈ ప్రచారం పిలుపునిస్తుంది అన్నారు. ఊపిరితిత్తులు, ప్యాంక్రియాటిక్, అండాశయ క్యాన్సర్ వంటి అనేక రకాల క్యాన్సర్లు శరీరంలో నిశ్శబ్దంగా అభివృద్ధి చెందుతాయి, ప్రారంభ దశల్లో స్పష్టమైన హెచ్చరిక సంకేతాలను చూపించవు అన్నారు. గుర్తించదగిన లక్షణాలు కనిపించే సమయానికి, వ్యాధి తరచుగా అభివృద్ధి చెందుతుంది, చికిత్సను మరింత సవాలుగా చేస్తుంది. క్యాన్సర్లో ప్రజల కేంద్రీకృత సంరక్షణ అవసరం. వివిధ రకాల క్యాన్సర్ల గురించి అవగాహన పెంచడం, నివారణ, ముందస్తు గుర్తింపు మరియు మరణాలను తగ్గించడానికి సమర్థవంతమైన చికిత్సను ప్రోత్సహించడం కోసం ప్రపంచ వేదికగా ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం గొప్ప ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డా.జె.వి.భాస్కర్, కళాశాల ఉమెన్స్ ఫోరం కో-ఆర్డినేటర్ వి.స్వర్ణ, ఏవో కొండారెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వసంత పంచమి, రథసప్తమిలతో ఆలయాలు కళకళ



తడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ఈ ఏడాది వసంత పంచమి, రథసప్తమి పర్వదినాలు వరుసగా రావడంతో తడ మండలంలోని పలు ఆలయాలు కళకళలాడాయి. వసంత పంచమి రోజు శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేశారు. రథసప్తమి సందర్భంగా మంగళవారం వైష్ణవాలయాల్లో పూజలు చేశారు. కంటికి కనిపించే దేవుడు సూర్యునికి పల్లెల్లో కూడా పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. చినమాంబట్టులో అక్షరాభ్యాసం, ప్రత్యేక వేడుకలు జరిపారు. గ్రామానికి చెందిన ముమ్మిటి చండీరాణమ్మ, కుమార స్వామి కుటుంబ సభ్యులు సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న విద్యార్థులకు పలకలు, ఇతర విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి స్విమ్స్ వైద్యులు, అన్నదాన ట్రస్టు వ్యవస్థాపకులు కె.మునుస్వామి, ట్రస్టు ఛైర్మన్ దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాల్టీ కార్మికుల ర్యాలీ

నాయుడుపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : వేతన బకాయిలు వెంటనే చెల్లించా లంటూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మున్సిపాల్టి కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. నాయుడుపేట మున్సిపాల్టి కార్యాలయం నుండి గాంధీమందిరం వరకు మున్సిపాల్టీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపాల్టీ కార్మికులు తదితరులు ఉన్నారు.

## చేపల కోసం చెరువు నీళ్లు ఖాళీ

విజయపురం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: మండలంలోని గంగమాంబాపురంకు సాగునీరు అందించే నింద్ర మండలం పాదిరి చెరువులో నీటిని చేపల కోసం ఖాళీ చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదిరి చెరువులో 70 శాతం సాగునీరు గంగమాంబాపురానికి, 30 శాతం సాగునీరు పాదిరికి పారుతున్నది. భూగర్భ జలాలు పెరగాలని, ప్రతి చిన్న కారు, సన్న కారు రైతులకు సాగునీరు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చెరువులను నిర్మాణం చేసి సాగునీటిని నిల్వ చేస్తే చెరువులో కేవలం చెరువులో చేపల కోసం వారం రోజుల క్రితం మొరవను కొట్టి సాగునీటిని వృథాగా వదిలేశారని గ్రామస్తులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సూర్యభగవానునికి ప్రత్యేక అభిషేకాలు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త బి శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా ఆలయాన్ని, ప్రవేశ గోపురాలను చక్కగా పూలతో ముస్తాబు చేసారు. అంతేకాక స్వామి గర్భగుడి ఎదురు తూర్పు అభిముఖంగా వెలసిన సూర్యభగవానుని చక్కగా ముస్తాబు చేసారు. అభిషేకాలు అలంకారాలు జరిపారు. అలాగే మోక్షగోపురం వద్ద వెలసిన చతుర్ముఖ సూర్యభగవానుని విగ్రహానికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు ఏర్పాటు చేసారు. రుద్రపాదాల వద్ద వెలసిన ఆలయాన్ని ఇటివల జీర్ణోద్ధారణ గావించారు. ఇక్కడ ప్రత్యేక పూజలు ఏర్పాటు చేసారు. ఆలయ పొరోహితులు అర్ధగిరి స్వామి, ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్‌లు కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు జరిపారు. మరెక్కడా లేని విధంగా ఇక్కడ చతుర్ముఖ సూర్యభగవానుని విగ్రహం ఉంది. ఈ విగ్రహాన్ని 'సూర్యపుష్కరిణి' నుంచి నీటిని సేకరించి అభిషేకాలు జరిపారు. వేదపండితులు అర్ధగిరి స్వామి వేద మంత్రాలను పఠిస్తుండగా స్థానిక ఆచారం మేరకు పూజలు అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయంలో...

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని గర్భగుడి ఎదురుగా తూర్పు అభిముఖంగా సూర్యభగవానుని విగ్రహం ఉంది. మంగళవారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు అలంకారాలు జరిపారు. ఆలయానికి వచ్చే భక్తులు విశేషంగా సూర్యభగవానుని అభిషేక సేవలో పాల్గొన్నారు. ఆలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు

### - జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్



చిత్తూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ఇంటర్మీ డియేట్ పబ్లిక్ పరీక్షలు-2025 నిర్వహణలో భాగంగా బుధవారం నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలను పక్కాగా నిర్వహించి పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఇంటర్మీ డియేట్ ప్రాక్టికల్ పరీక్షల న్విహణ ఏర్పాట్లపై మంగళవారం డిఆర్ఓ మోహన్‌కుమార్ డిఆర్ఓ ఛాంబర్‌లోని సమావేశపుహాలులో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం నుండి ప్రారంభమై ఫిబ్రవరి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలను మూడు విడతల్లో మొదటి, ద్వితీయ సంవత్సర ఇంటర్మీడియేట్ విద్యార్థులకు 69 కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలకు మొదటి, ద్వితీయ ఇంటర్మీడియేట్‌లకు సంబంధించి 12,311 మంది విద్యార్థులు హాజరు కానున్నా రన్నారు. అలాగే ఒకేషనల్ కోర్సులకు సంబంధించి బుధవారం నుండి ఫిబ్రవరి 9వ తేదీ వరకు 11 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐఓ సయ్యద్‌మౌలా, స్పెషల్ ఆఫీసర్ దయానందరాజు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు బాలసుబ్రమణ్యంరాజు, నిర్మలా కుమారి, శరత్, చంద్రశేఖర్, హేమలత, వెంకటరమణారెడ్డి, చిత్తూరు డివైఇఓ చంద్రశేఖర్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వర్గీకరణ పేరుతో కులాల మధ్య చిచ్చు

### - చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట మాజీ ఎంపీ చింతామోహన్ ఆధ్వర్యంలో నిరసన



చిత్తూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్గీకరణ పేరిట ఎస్సీ, ఎస్టీల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలనే డిమాండ్‌తో మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియన్ నేత డాక్టర్ చింతామోహన్ ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ చింతా మోహన్ మాట్లాడుతూ బ్యాంకులు దోచుకునే వారికి రుణాలు మంజూరు చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబిసీల అభ్యున్నతి కోసం రిజర్వేషన్లు తీసుకువచ్చి అమలు చేసింది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. జాతిపిత మహాత్మగాంధీ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఐబిసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. అయితే ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీ, ఐబిసీల్లో ఏ మాత్రం అభివృద్ధి కన్పించడం లేదన్నారు. చిత్తూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, ఐబిసీల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## డీజీపీని కలిసిన రెడ్ శాండర్స్ టాస్క్ ఫోర్స్ ఎస్పీ



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : నూతన ఏపీ డీజీపీగా భాధ్యతలు చేపట్టిన శ్రీ హరీష్ కుమార్ గుప్తని ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) ఎస్పీ పీ. శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీకి టాస్క్ ఫోర్స్ పనితీరు గురించి ఎస్పీ వివరించారు. ఆపరేషన్స్‌లో చేపడుతున్న కూంబింగ్ వివరాలు, సాంకేతికంగా తీసుకుంటున్న చర్యలు గురించి తెలియజేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి మరింతగా కృషి చేయాలని డీజీపీ సూచించారు.

## అవగాహనతోనే క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చు

కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : దేశంలో అత్యధికంగా మరణాలకు కారణమవుతున్న వాటిలో క్యాన్సర్‌ది రెండో స్థానమని, బాధితుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరికి మహమ్మారి ముదిరిన తర్వాతే నిర్ధారణ అవుతుందని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూపాయ అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవడం, గుర్తించడం, చికిత్సలు అందించే ప్రక్రియలో భాగంగా ఇంటింటా ఎన్‌సిడి, సిడిసి.0 పేరుతో దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రప్రభుత్వం సర్వే చేయిస్తుందన్నారు. 18 ఏళ్ల పైబడిన వారి జీవనశైలిలో మార్పులు, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, ముందస్తు గుర్తింపు చికిత్సపై అవగాహన పెంచుకోవడం ద్వారా క్యాన్సర్‌ను అడ్డుకోవచ్చని తెలిపారు.

## సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం

కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : 10వ తరగతిలో నూరుశాతం ఫలితాల సాధనకు ప్రభుత్వం ఇచ్చిన వందరోజుల ప్రణాళికలో భాగంగా రెండో శనివారం, ఆదివారాలలో కూడా ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ సెలవు రోజుల్లో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకునే భోజనానికి ప్రభుత్వం స్వస్తి పలికిందని మండల విద్యాశాఖ అధికారి మస్తానయ్య చెప్పారు. సెలవు దినాల్లో 10వ తరగతి విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా భోజనం అందిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులకు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే బాధ్యత తప్పిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వందశాతం 10వ తరగతి పరీక్షల ఫలితాలు తీసుకురావాలని అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని చెప్పారు.

## నిరంతరం యోగా చేయండి

కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : విద్యార్థులు నిరంతరం యోగా చేసి ఏకాగ్రతను సొంతం చేసుకోవాలని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ హరినాథరెడ్డి కోరారు. మంగళవారం సూర్యభగవానుడి జయంతి రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో యోగా క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు, సూర్య నమస్కారాలపై సాధన చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హరినాథరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి ఆలయంలోని హుండీలను మంగళవారం లెక్కించారు. 105 రోజులకు గాను 53 లక్షల 23 వేల 998 రూపాయలు ఆదాయంగా లభించింది. యుఎస్ఎ డాలర్లు 31, సింగపూర్ డాలర్లు 4, సౌదీ రియాల్స్ 50, యుఏఇ దినార్స్ 5, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, మలేసియా రింగిట్స్ 12, ఆస్ట్రేలియా డాలర్లు 50, టిఎవి హుండ్రా కర్నూరు 200, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఒమెంత్ 1 చొప్పున హుండీ లెక్కింపులో లభించాయి. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాసబాబు పర్యవేక్షణలో దేవస్థాయ సహాయక కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఈ లెక్కింపు జరిగింది.

## అద్దూరు రమణమ్మ కుంబాన్ని పరామర్శించిన కిలివేటి



చిట్టమూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : చిట్టమూరు మండలం దరకాస్తు గ్రామానికి చెందిన అద్దూరు బ్రదర్స్ మాతృమూర్తి అద్దూరు రమణమ్మ (80) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దరకాస్తు గ్రామానికి చేరుకొని రమణమ్మ కుమారులైన అద్దూరు రవి, అద్దూరు నాగరాజులను పరామర్శించారు. కిలివేటితో పాటు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైసీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, ఓజిలి మండల పార్టీ అధ్యక్షులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, గందవల్లి సిద్దయ్య, షబ్బీర్, పరంగి ప్రసాద్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ఈ పంట నమోదు చేసుకోవాలి



వెంకటగిరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని ఏడివ ఎం నాగార్జున సాగర్ తెలిపారు. మండలంలోని సిద్దవరం, గుండ్లసముద్రం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమము వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది వారిచే నిర్వహించడం జరిగినది. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పంట వేసిన ప్రతి రైతు ఈ పంటను గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. రైతు సోదరులకు వరి పంటలో వచ్చు వివిధ రకాల పురుగులు, తెగ్గుళ్ళ గురించి పురుగు మందుల పిచికారి మరియు మోతాదును రైతులకు క్షుణ్ణంగా వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి.సుజాత రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ గురించి వివరించారు. అదేవిధంగా అందరూ తగు సలహాలు సూచనలు కోసం మండల వ్యవసాయ అధికారి వారి కార్యాలయం లేదా రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాదం.శివకుమార్, ఏ హెచ్ ఏ నీరజ, దేవి, నాయకులు మునిరత్నం, నక్కల ప్రసాద్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## టిడిపితోనే బీసీలకు పెద్ద పీట



గూడూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసిన రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయి బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాయి బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం పాల్గొన్నారు. సదాశివంను స్థానిక టిడిపి నాయకులు, నాయి బ్రాహ్మణ సంఘాల నాయకులు బీసీ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాజు, జిల్లా అధికార ప్రతినిధి చెంచురామయ్య, టిడిపి నాయకులు రహీం, ఇజ్రాయిల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రావెల్ బస్సును ఢీకొన్న ఆర్టీసి బస్సు

చిల్లకూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : ఆగి ఉన్న ట్రావెల్ బస్సును ఆర్టీసి బస్సు ఢీకొన్న సంఘటన బూధనం సమీపంలోని టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకుంది. వరంగలుకి ప్రాంతానికి వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సును, టోల్ ప్లాజా వద్ద ఆగి ఉండగా నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనక నుండి ఢీకొనడంతో 5 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ క్షతగాత్రులను గూడూరు ఆసుపత్రికి 108 వాహన సాయంతో తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు పోలీసులు సాయి సురేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తుమ్మలగుంటలో వైభవంగా రథసప్తమి వేడుకలు

### -సప్త వాహనాలపై కల్యాణ వెంకన్న విహరిస్తూ భక్తులకు దర్శనం



తిరుపతిరూరల్, ఫిబ్రవరి4 ప్రభాతవార్త: తుమ్మలగుంటలో శ్రీకల్యాణ వెంకన్న ఆలయంలో రథసప్తమి వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి. తిరుపతి, తిరుపతి పరిసర ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున స్వామి వారి సప్త వాహనాలలో విహారించిన శ్రీకల్యాణ వెంకన్నను దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. భక్తులు గోవింద నామ స్మరణలు, కర్పూర హారతుల నడుమ స్వామి వాహన సేవలు కన్నుల పండువుగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, లక్ష్మీ దంపతులు స్వామి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

### - 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం - పారిపోయిన వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త అన్నమయ్య జిల్లా వీరబల్లి ఫారెస్టు బీటు పరిధిలో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు, వారి నుంచి 9 ఎర్రచందనం దుంగలను ఎర్రచందనం టాస్క్ ఫోర్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ జి. బాలిరెడ్డి మార్గనిర్దేశకంలో ఆర్ఐ (ఆపరేషన్స్) కే. సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ కేఎస్కే లింగాధర్ టీమ్ స్థానిక ఎఫ్బీఒ జి అనిల్ కుమార్‌తో కలసి, సోమవారం నుంచి అన్నమయ్య జిల్లా వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. వీరు ఆ ప్రాంతంలోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళుతూ మంగళవారం ఉదయం వీరబల్లి మండలం జరికోన వద్దకు చేరుకున్నారు. అక్కడ కొంత మంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని హెచ్చరించినా ఖాతరు చేయకపోవడంతో వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. కాగా వారిలో కొందరు పారిపోగా వెంబడించి ఆరుగురిని పట్టుకోగలిగారు. ఆ ప్రాంతంలో వెతుకగా 9ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి, దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పారి పోయిన వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు ఈ కేసును నమోదు చేసుకున్న ఎస్ఐ ఎండీ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు వీ. శ్రీనివాస రెడ్డి, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో వైభవంగా రథసప్తమి వేడుకలు



కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి, భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయం, శ్రీమణి కంఠేశ్వరాలయంలలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు ప్రధాన ఆలయంలో ఉదయం స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకార మండపంలో సూర్య భగవానుడికి సూర్యఆరాధన, సూర్యనమస్కారాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రధాన ఆలయ అనుబంధ ఆలయంమైన శ్రీమణికంఠేశ్వ రాలయంలో శ్రీసూర్య నారాయణమూర్తికి విశేష అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సూర్య నారాయణస్వామికి ప్రత్యేకపూజలు చేసి సూర్య నమస్కారం కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి,వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి,బాలాజి నాయుడు, ఆలయ అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## కూరగాయల అంటుకట్టుపై రెండోరోజు శిక్షణ తరగతులు

కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(హార్టీకల్చర్ హబ్)లో 12 రాష్ట్రాలకు చెందిన ఉద్యానవన అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న విషయం విదితమే. మంగళవారం కూరగాయల అంటుకట్టు విధానం, హైడ్రోఫోనిక్స్ విధానం గురించి అధికారులకు శిక్షణ కల్పించారు. ఈసందర్భంగా గ్రీన్ ఆర్బిట్ అధినేత శ్రీనివాస్ మాట్లాడుతూ ఇండో - ఇజ్రాయిల్ కూరగాయల్లో అంటుకట్టే విధానం గురించి వివరించారు. అనంతరం గంగవరం మండలంలోని గ్రీన్ ఆర్బిట్ ఫామ్‌లో హైడ్రోపోనిక్స్ యూనిట్‌లో లెట్యూస్ సాగు విధానం, డ్రిప్ ఆటోమేషన్ యూనిట్, పాలిహౌస్‌లో పండిస్తున్న చెర్రీ టమోటా, క్యాప్సికం పంటల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంబసీ బ్రహ్మదేవ్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి, హార్టీకల్చర్ ఎడి కోటేశ్వరరావు, ఉద్యానవన అధికారులు డింపుప్రియశ్రీ, వింధ్య, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా రథసప్తమి



చంద్రగిరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: సూర్యభగవానుడి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సకల ప్రపంచానికి, ముక్కోటి దేవ దేవతలకు ఆరాధ్యదైవమైన సూర్య భగవానుడి జన్మ దినోత్సవం, రథ సప్తమిని పురస్కరించుకుని మంగళ వారం శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు శ్రీదేవి భూదేవి సమేతులై, టిటిడి అనుబంధ శ్రీకోదండరామస్వామి వారు శ్రీసీరామలక్ష్మణ హనుమంత సమేతులై, చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు, సూర్యప్రభ వాహనంలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవల్లో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అమ్మవారి ఆలయ ఈఓ కె.మమతలు పాల్గొన్నారు.

## సూర్యప్రభవాహనంపై స్వామి, అమ్మవారి దర్శనం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా స్వామి అమ్మ వార్ల గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మంగళవారం శ్రీకాళహస్తీ శ్వరాలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను చక్కగా ముస్తాబు చేసారు. భక్తులు భాగస్వాములుగా ఆలయంలో ఊరేగింపుగా రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ సంప్రదాయం ప్రకారం పూజలు జరిపి స్వామివారిని సూర్యప్రభ వాహనం లోనూ, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని చప్పర వాహనంలో ప్రతిష్టించారు. ఆలయ సిఎస్ఓ నాగభూషణం యాదవ్, టెంపుల ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ వెంటరాగా మేళతాళాలు మంగళవాయిద్యాలతో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నాలుగుమాడావీధుల్లో సాగింది. ఉత్సవం వెంట ఉభయదారులు చెర్లోపల్లి గ్రామానికి చెందిన మునగాల భక్తవత్సల నాయుడు కుటుంబసభ్యులు హాజరయ్యారు.